క్లుప్తంగా

గుమ్మడికాయకు భలే గిరాకీ



విక్రయానికి ఉంచిన గుమ్మడికాయలు

సైదాపురం: దసరా వచ్చిందంటే చాలు గుమ్మడి కాయకు భలే గిరాకీ వచ్చేస్తుంది. అందులోనూ ఆదివారం అమావాస్యకు ప్రతి ఇంటి ముందు గుమ్మడి కాయను దిష్టి తీయడం ఆచారం. నేడు ఆదివారం అమావాస్య కావడంతో గుమ్మడి కాయకు మంచి గిరాకీ పలికింది. త్వరలోనే దసరా పండుగ కూడా రావడంతో గుమ్మడి కాయకు డిమాండ్ భారీగా పెరిగింది.

22న చలో కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న మునెయ్య

వెంకటగిరి రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన మందిరం స్థలం దురాక్రమణను నిరసిస్తూ ఈనెల 22వ తేదీన ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు గద్దల మునెయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ డక్కిలి మండలం మోపూరు రోడ్డు సెంటర్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన మందిర స్థలాన్ని తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కొందరు ఆక్రమించినట్లు తెలిపారు. దళిత, గిరిజన సంఘాల నేతలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కిలివేటి పరామర్శ



నివాళులర్పిస్తున్న కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓజిలి: మండలంలోని ఆర్మేనిపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుంటమడుగు నరేంద్రరాజును శనివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఇటీవల నరేంద్ర రాజు తండ్రి ఎంపీటీసీ సభ్యుడు రఘు రామరాజు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ముందు ఎంపీటీసీ సభ్యుడు రఘురామరాజు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఆలయానికి మైక్ సెట్ వితరణ



మైక్ సెట్ పరికరాలు అందజేస్తున్న దాతలు

వాకాడు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వెలసిన శ్రీ వీరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి శనివారం సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దాతలు మైక్ సెట్ పరికరాలు అందజేశారు. దాతలు సూళ్లూరుపేట, ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడిన మారం శెట్టి శారద కుటుంబ సభ్యులు మారంశెట్టి సాయి కళ్యాణ్, చక్రవర్తి, జ్ఞాపిక, చార్వి సహకారంతో రూ.15వేలు విలువ చేసే మైక్ సెట్ పరికరాలను ఆలయ నిర్వాహకులు సులభాదేవి, అమలాంబ సమేత పరిపూర్ణానందస్వాముల వారికి అందజేశారు.

మొక్కలు నాటడం బాధ్యత

గూడూరురూరల్ : గూడూరు పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర 2025 సెప్టెంబర్ నెల థీమ్ గ్రీన్ ఏపీలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో మొక్కలు నాటి గ్రీన్ ఏపీ ఆవశ్యకతను తెలియజేశారు.

ఎస్‌ఏఎల్‌సీ మాజీ బిషప్ డేవిడ్ మృతి



నక్కా డేవిడ్ (ఫైల్)

చిల్లకూరు: తిరుపతికి చెందిన సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి మాజీ బిషప్ నక్కా డేవిడ్ (80)శనివారం కన్నుమూశారు. మండలం కమ్మవారిపాళెం గ్రామంలో పుట్టిన ఆయన డిగ్రీ వరకు చదివిన తరువాత హైదరాబాద్‌లోని క్రైస్తవ థీయాలజికల్ కళాశాలలో బీటీహెచ్, బీడీ పూర్తి చేసిన తరువాత దేవుని సేవలో కొనసాగారు. ఆయన మూడు పర్యాయాలు ఎస్‌ఏఎల్‌సీ సభ్యుల ద్వారా బిషప్‌గా ఎంపికయ్యారు. ఇటీవల అనారోగ్యం పాలు కావడంతో చెన్నైలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన భూస్థాపన ఆరాధన ఆదివారం కమ్మవారిపాళెంలో నిర్వహించనున్నట్లు ఎస్‌ఏఎల్‌సీ కమిటీ సభ్యులు తెలిపారు.

చికెన్ ధరలు 20-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	138
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	246
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	272
లేయర్ చికెన్	:	187

రైతులు అభివృద్ధి చేసుకున్న ఆనేగొట్టం పెద్ద చెరువు పంట కాలువ





రైతుల కష్టం స్వాహాకు యత్నం

దొరవారిసత్రం : రైతులందరూ కలిసికట్టుగా కొంత నగదు సమకూర్చుకుని పిచ్చి మొక్కలతో నిండిపోయి, పూడిపోయిన పంట కాలువను అభివృద్ధి చేసుకున్నారు. ఈ పనిని ఉపాధి కూలీలు చేసినట్లు రికార్డులు సృష్టించి సంబంధిత అధికారుల సహకారంతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులు కాజేందుకు ఫీల్డ్ అసిస్టెంట్ ప్రయత్నిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఆనేగొట్టం పెద్ద చెరువు నుంచి...

ఆనేగొట్టం గ్రామం పరిధిలోని పెద్దచెరువు కింద సుమారు 270 ఎకరాలు సాగవుతుంది. ఈ చెరువు నుంచి పంట పొలాలకు సాగు నీళ్లు అందించే పంట కాలువ అభివృద్ధికి స్థానిక రైతులు పూనుకున్నారు. రైతులందరూ రూ.1.5 లక్షల వరకు పోగు చేసుకుని ఆగస్టులో రెండు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్న పంట కాలువలో పిచ్చి మొక్కలు తొలగించి పూడికతీత పనులు చేయించుకున్నారు. అయితే అదే ప్రాంతానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ గత వారం నుంచి కూలీలతో పంట కాలువ పనులు చేసినట్లు ఫొటోలు తీడడం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం వంటి పనులు చేస్తున్నట్లు స్థానిక రైతులు



రైతులు అభివృద్ధి చేసుకున్న పంట కాలువలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

తెలియజేశారు. ఇదే విషయమై ఈసీ శ్రీనును సంప్రదించగా పెద్ద చెరువు నుంచి వెళ్లే పంట కాలువ పనులను స్వయంగా వెళ్లి తనిఖీ చేస్తామన్నారు. రైతులు చేసుకున్న పనులకు ఉపాధి బిల్లులు పెట్టే ప్రయత్నం చేస్తే మాత్రం సంబంధిత ఎఫ్ఏపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

చిట్టమూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు మొక్కలు నాటేలా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం కాలుష్యం కాకుండా మానవాళికి ఆక్సిజన్ అందుతుందన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా పైపులైన్లకు మరమ్మతులు చేట్టాలని కోరారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న వైద్యులు జూబిబేగం

రాపూరు: పోషకాహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జూబి బేగం అన్నారు. సచివాలయంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు, తల్లులకు, గర్భవతులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భవతులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి చేయూత



వృద్ధులకు సరుకులు అందిస్తున్న దాతలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు పట్టణంలోని ప్రభాకర్ రెడ్డి, సత్యవతమ్మ దంపతులు చేయూత అందించారు. ఆశ్రమంలోని వృద్ధులకు శనివారం నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యం బస్తా తదితర వస్తువులు వితరణగా అందించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

గూడూరురూరల్ : గూడూరు రెండో పట్టణంలోని నరసింగరావుపేటలో ఉన్న సిద్దార్ధ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ తలమంచి వినోద్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 400 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు యామిని, దువ్వూరు లక్ష్మి సుధ, జనిత్‌రెడ్డి, స్వప్న గంటుపల్లి, ఆసుపత్రి వ్యవస్థాపకులు తలమంచి సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 50.136 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 50.136 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,230 క్యూసెక్కు నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1150, పిన్నేరుకాలువకు 20, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి, అమ్మవార్లు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద తిరువళ్ల శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వార్లకు అభిషేక పూజలను నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తుల సారథ్యంలో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద వేదపండితులు సారథ్యంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ వేడుకలను కనుల పండువగా జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, ఉభయదాతలు పాల్గొన్నారు.

25న అమృత భారత్ స్టాపింగ్

నాయుడుపేటటౌన్: బిహర్ నుంచి తమిళనాడు ఈ రోడ్ వరకు వెళ్లే అమృత భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు(16601-16602)ఈనెల 25 నుంచి నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ ఉన్నట్లు స్థానిక రైల్వే వినియోగదారుల అసోయేషన్ ప్రెసిడెంట్ మస్తానయ్య శనివారం తెలిపారు. అమృత భారత్ వీక్లి ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 25తేది గురువారం ఉదయం 8.10 గంటలకు తమిళనాడులోని ఈ రోడ్ నుంచి బయలుదేరి సేలం మీదుగా జాలర్‌పాట్టై, కాట్‌పాడి, అరక్కోణం, పెరంబూర్ మీదుగా సాయంత్రం నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు చేరుకుటుందన్నారు.

శరన్నవరాత్రికి ముస్తాబు

నాయుడుపేటటౌన్: అమ్మవారి శరన్నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేందుకు ఆలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. పట్టణంలోని పోలేరమ్మ, మూకాంబికాదేవి, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి, షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వ స్వామి, భగవతే శ్రీ మల్లికాంభదేవి దుర్గామల్లేశ్వరి దేవి ఆలయాలు, మండలంలోని అమ్మవారి ఆలయాల్లో సోమవారం నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

పెళ్లకూరు: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం చిల్లకూరు గ్రామ సచివాలయంలో స్వస్తినారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనుమరాయకొండపై పల్లకి ఉత్సవం





ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహ స్వామి, పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని అలిమిలి గ్రామ సమీపం కనుమరాయకొండపై వెలసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి పల్లకి ఉత్సవం వేద మంత్రాలతో మంగళవాయిద్యాలతో నడుమ అత్యంత వైభవంగా శనివారం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీదేవి భాగవతం కథలు పుస్తకావిష్కరణ

గూడూరురూరల్ : గూడూరు పట్టణానికి చెందిన టి.వి.ఎల్.ప్రసాద్ శ్రీదేవి భాగవతం కథలను రచించారు. సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ ప్రచురణ బాధ్యతను స్వీకరించి పుసకాన్ని ముద్రించారు. ఈమేరకు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో శ్రీదేవి భాగత కథలు పుస్తకాన్ని శ్రీవిజయ దుర్గ ఉపపీఠం నిర్వాహకులు కోట సునీల్‌కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భాగవత కథలు అర్థమయ్యే రీతిలో సరళంగా టి.వి.ఎల్.ప్రసాద్ రచించడం సంతోషంగా ఉందన్నారు. సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్, డాక్టర్ రోహిణి, శ్రీకంటి రామ్మోహన్, శ్రీధర్, మీరారెడ్డి, మహిళా మండలి, ప్రముఖులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తం.. శ్రీవారి కల్యాణం

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ, ఉదయం శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకార మండపంలోకి వేంచేపు చేసి అక్కడ తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్రదీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్యకల్యాణ మండపంలో స్వామి అమ్మవార్ల కల్యాణం అగమోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు.





స్వామి అమ్మవార్ల ఊంజల్‌సేవకు స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

‘స్వస్థ్ నారీ సశక్త్’తో ఆరోగ్యం పదిలం



ఆర్మేనిపాడులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ నారాయణరెడ్డి

కలువాయి(సైదాపురం): స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్‌తో ఆడబిడ్డల ఆరోగ్యం పదిలం అని వైద్యాధికారి ఎం విజయలక్ష్మి తెలిపారు. స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కలువాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కలువాయి బస్టాండ్ సెంటర్‌లో ఎంపీడీఓ శైలజ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. బీవీఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ చేసి, మానవహారం నిర్వహించారు.

పరిశుభ్రంగా ఉండాలి

ఓజిలి: గ్రామ పంచాయతీలు పరిశుభ్రంగా ఉండేందుకు గ్రామస్తులు సహకారంతో ఎంతో అవసరమని ఎంపీడీవో నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆర్మేనిపాడు గ్రామంలో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

స్వచ్ఛతా హి సేవపై ప్రత్యేక శ్రద్ధ

నాయుడుపేట టౌన్: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతి ఒక్కరూ శుభ్రతను పాటించాలని ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో నూతన పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు.

లక్ష్మీనరసింహస్వామికి పల్లకీ సేవ



పల్లకిలో ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ,లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారితో పాటుగా, ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యే అభిషేకాలు చేశారు. ఉదయం అభిషేకాలకు చిట్టమూరు మండలం కూచివాడపాళెం గ్రామానికి చెందిన బల్లి ప్రవీణ్ కుమార్, శిరీషా దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వారికి పల్లకీ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను పంచి పెట్టగా ఎలాంటి ఇబ్బంది లేకుండా కలవకొండ గ్రామ భక్త బృందం పర్యవేక్షించారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తడలో గురజాడ జయంతి వేడుకలు



గురజాడ జయంతి కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

తడ: మహా కవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం తడ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 21న గురజాడ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవి సీహెచ్ సుధాకర్‌రావు మాట్లాడారు. గురజాడ వెంకట అప్పారావు రాసిన ×దేశమును ప్రేమించుమన్నా× అనే పద్యం నాటి నుంచి నేటి వరకు ఎందరికో స్ఫూర్తిగా నిలిచిందన్నారు. నాటి పరిస్థితులకు అద్దం పట్టే కన్యాశుల్కం నాటకం ఎందరో మహిళల జీవితాలకు వెలుగును ఇచ్చిందని ఆయన అన్నారు. పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయ నాటికను విద్యార్థినులు అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం ఈ నెల 18న మండల స్థాయి పాఠశాలల్లో నిర్వహించిన దేశమును ప్రేమించుమన్నా గేయాలాపన పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేములు, మల్లికార్జునరావు, హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు చెంగయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆక్రమిత ప్రభుత్వ భూమిలో సర్వే



చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ

చిట్టమూరు: మండల పరిధిలోని నార్తువరత్తూరు గ్రామ కాత్రాయగుంట చెరువులో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు. గ్రామస్తులు నార్తువత్తూరు పెద్ద చెరువు, కాత్రాయగుంట చెరువును ఆక్రమించి జేసీబీతో చదును చేసి వరి పంట సాగు చేసేందుకు ఉపక్రమిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఏఈ అబ్దుల్ ఘనీ, రెవెన్యూ సర్వేయర్ సంయుక్తంగా ఆక్రమించిన భూమిని సర్వే చేసి, ప్రభుత్వ భూమి ఎంత ఉందో హద్దులు ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ ఏఈ మాట్లాడుతూ చెరువును ఆక్రమించిన వారికి ముందుగా నోటీసులు అందజేస్తామన్నారు. ఆ నోటీసులను ధిక్కరించి ప్రభుత్వ భూమిలోకి ప్రవేశిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

రెజ్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు రాజుపాళెం జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న ముత్యాలయ్య, చరణ్ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు శనివారం స్థానిక ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 15, 17 తేదీల్లో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ముత్యాలయ్య, చరణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను కోచ్ ఉదయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

యూరియా స్టాకు రిజిస్టర్ తప్పనిసరి



డీలర్లతో మాట్లాడుతున్న ఏఓ నిరంజన్ కుమార్

చిట్టమూరు: ప్రవేటు ఎరువుల దుకాణదారులు రైతులకు విక్రయించే యూరియా బస్తాలకు సంబంధించిన స్టాకు రిజిష్టర్ సక్రమంగా లేకపోతే రూ.50 వేలు వరకూ జరిమానా విధిస్తారని మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ పేర్కొన్నారు. చిట్టమూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం ప్రైవేటు ఎరువుల దుకాణదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రధానంగా యూరియా విక్రయాలపై డీలర్లకు దిశానిర్దేశం చేశారు.